క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతి ఒక్కరూ చేరాలని ప్రిన్సిపాల్ దాసరి నాగభూషణం అన్నారు. బుధవారం ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ గ్రూపులో వెయ్యి మార్కులకు 926 మార్కులు సాధించి హైదరాబాద్, నిజాం డిగ్రీ కళాశాలలో సీటు పొందిన అనిరుద్ అనే విద్యార్థిని బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో లభిస్తున్న నాణ్యమైన విద్యను వినియోగించుకుంటే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. హెచ్ఈసీ గ్రూపు ఎన్నుకున్న వారికి సివిల్స్‌లో గ్రూప్–1, 2 ఉన్నత ఉద్యోగాలకు ఎంపికవడం సులువన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు యమున, శ్రీనివాణి, రమేశ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాయికల్:రాయికల్-మైతాపూర్ గ్రామాల మధ్య నూతన వంతెన నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని మైతాపూర్‌కు చెందిన నాయకులు బుధవారం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపి రాజిరెడ్డి, తలారి రాజేశ్, నారాయణ, లక్ష్మీనారాయణ, బొమ్మెన బాపు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సారథి బృందం

సారంగాపూర్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని గణేశ్‌పల్లిలో సారథి సభ్యులు తమ గేయాలతో ప్రజలను పలు అంశాలపై చైతన్యపరిచారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీని ద్వారా అంటువ్యాధులు పడకుండా ఉండవచ్చన్నారు. ప్రతీ ఇంటిలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు మహిపాల్, మల్లిక్‌తేజ, రాజేందర్, ప్రవీణ్, సురేశ్ నాయక్, అశోక్, రమేశ్, పోచయ్య, ప్రకాశ్, రాజ్‌కుమార్, రమ్య. పంచాయతీ కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

మిగిలిన పోస్టులను అర్హులతో భర్తీ చేయాలి

జగిత్యాల: పదోన్నతులకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ పదోన్నతుల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, మిగిలిన పోస్టులను అర్హులైన వారికి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరికే ఒకటి కన్నా ఎక్కువ పదోన్నతులు వచ్చిన కారణంగా మిగిలిన ఖాళీలను అర్హులైన వారికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మహేశ్‌గౌడ్, సర్వసతీశ్, మహేశ్, శ్రీనివాస్, జనార్దన్ పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

ఇబ్రహీంపట్నం: జాతీయ స్థాయిలో జరిగే నీట్ పరీక్ష లీక్ తో విద్యార్థుల భవిష్యతు ఆగమైందని తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని మండలంలోని బర్తీపూర్ మాజీ సర్పంచ్ సంగం సాగర్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం ఆడుకుంటుందని,ఉన్నత విద్యగా భావించే వైద్య, విద్యలో ఇలాంటి లోపాలు జరగడం చాలా బాధాకరమని, ఇంతటి దుశ్చర్యలకు పాల్పడ్డవారు ఎంతటి వారైనా చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చురుగ్గా దుబ్బరాజన్న ఆలయ పనులు

- కొనసాగుతున్న ప్రాకార నిర్మాణం..
- గత ప్రభుత్వ హయాంలో రూ.86.50 లక్షలు మంజూరు
- సాంకేతిక కారణాలతో పనుల్లో తీవ్ర జాప్యం



కొనసాగుతున్న ప్రాకారం (ప్రహరీ) నిర్మాణ పనులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. జగిత్యాల జిల్లాలో అతిపెద్ద శైవక్షేత్రం దుబ్బరాజన్న ఆలయానికి రోజు భారీ ఎత్తున భక్తులు తరలివస్తారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతర బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో రూ. 86.50 లక్షలు మంజూరు కాగా, సాంకేతిక కారణాలతో పనులు ప్రారంభానికి మూడేళ్లు పట్టింది.

రూ. 26.50 లక్షలతో ప్రాకార నిర్మాణం.. రాజగోపురం

దుబ్బరాజన్న ఆలయం చుట్టూ గతంలో ఏర్పాటు చేసిన ప్రహరీని తొలగించి నూతనంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం తరహాలో చుట్టూ ప్రకార నిర్మాణంతో పాటు, ఆలయం ముందు రాజగోపురం నిర్మాణం చేయడానికి దేవాదాయ శాఖ ఈ నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం ఆలయం చుట్టూ గతంలో ఉన్న ప్రహరీని పూర్తిగా తొలగించారు. వెనుక వైపు వాస్తు కారణంగా ప్రస్తుతం నిర్మాణం చేస్తున్న ప్రాకార నిర్మాణంతో ఆలయం వెనుకవైపు స్థలం పూర్తిగా తగ్గిపోయింది. ప్రాకార నిర్మాణ పనులు మరో రెండు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. ఆలయం చుట్టూ ప్రాకార నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. ప్రాకార నిర్మాణంలో ఎక్కువ పని చెన్నై నుంచి వచ్చిన శిల్పులు చేపడతారని , ఈ పనులు కూడా వెంటనే ప్రారంభిస్తామని ఈవో కాంతారెడ్డి తెలిపారు.

రాజగోపురం నిర్మాణం

ఆలయం ముందు నిర్మాణం చేసే రాజగోపురం సైతం వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న రాజగోపురం నిర్మాణంలాగానే ఉండాలని భక్తులు భావిస్తున్నారు. రాజగోపురం దేవాదాయ శాఖ మూడు అంతస్తులతో (35) అడుగుల ఎత్తుతో నిర్మించాలని దేవాదాయ అంచనాల్లో పేర్కొంది. కాగా రాజగోపురం ఎత్తు మరింత పెంచాలని, దీంతో ఆలయ శోభ మరింత పెరుగుతుందని, దీనికి అవసరమైన నిధులు అవసరం ఉంటాయని, దీనికోసం భక్తులు భారీగా విరాళాలు సమకూర్చడానికి ముందుకు వస్తున్నారు.

షీ టీమ్స్‌తో మహిళల భద్రతకు భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్సై అలీబేగ్

జగిత్యాలక్రైం: మహిళల భద్రత,రక్షణకు షీ టీమ్స్‌తో భరోసా కల్పించడం జరుగుతుందని షీటీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో షీ టీం, ఏహెచ్‌టీయూ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలు, విద్యార్థిని విద్యార్థుల రక్షణకు పోలీస్ శాఖ తరఫున షీ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని లేదా 8712670783 వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. పాఠశాలలు, కళాశాలల నుంచి పాఠశాలకు ఇద్దరి చొప్పున విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్,ఆకతాయిల వేధింపులను అరికట్టడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దుతామన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు విద్యార్థినులు విద్యార్థులు వెంటనే జిల్లా షీ టీం ఫోన్ నెంబర్ 8712670783 కి ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సందేశం పంపించి వెంటనే షీ టీమ్స్ సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగసుధారాణి, మహిళ కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న రాంరెడ్డి

రాయికల్: మండలంలోని ఆలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు బుధవారం గ్రామానికి చెందిన మెక్కొండ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయికృష్ణ, కిశోర్, కవిత, శృతి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ శేఖర్ పాల్గొన్నారు.

పుస్తకాలు, దుస్తులు పంపిణీ..

ధర్మపురి: మండలంలోని జైనా జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎంపీటీసీ కుంట రజిత సుధాకర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని అంతే కాకుండా శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తారని, ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు సాయం



విద్యార్థినికి సాయం చేస్తున్న అమర్నాథ్

ధర్మపురి: ఉన్నత చదువులు చదవాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ ఆర్థికంగా లేక పోవడంతో ఎంతో మంది పేద విద్యార్థులు చదువులకు దూరమౌతున్నారు. ధర్మపురికి చెందిన అయ్యోరి అమూల్య అనే విద్యార్థిని పాలిటెక్నికల్ కళాశాలలో సీటు సంపాదించింది. అయితే విద్యార్థిని చదువుకు ఏడాదికి 15 వేల రూ.లు అవుతుండగా ఆ ఖర్చులు భరించే స్థితిలో తన కుటుంబం లేదని తెలిపింది. దీంతో విద్యార్థి చదువులకు భరోసా కల్పించడం కోసం స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రామ్ కన్వీనర్ గొల్లపల్లి గణేశ్ (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) ఆధ్వర్యంలో ధర్మపురి వాసి సారంగుల అమర్నాథ్ దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థి చదువుకు అయ్యే ఖర్చులు తన స్వచ్ఛంద సంస్థ వికసిత్ భారత్ 2047 పౌండేషన్ ద్వారా చెల్లించడానికి ముందుకు వచ్చారు. బుధవారం రూ.15 వేలను స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో అందజేశారు. ఈసందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమ సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దాత సారంగుల అమర్నాథ్, ఉపాధ్యాయులు కాసర్ల వెంకటరమణ, గణేశ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, బుజ్జమ్మ, సువర్ణ, సుజాత, అనురాధ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



సిరికొండలో కొనసాగుతున్న నల్లాల సర్వే

బుగ్గారం: గ్రామాల్లో భగీరథ నల్లాల సంఖ్య,వాటి పనితీరు వంటి అంశాలను తేల్చడానికి ఇంటింటి సర్వే కొనసాగుతుంది. మిషన్ భగీరథ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఇంకా పలు గ్రామాల్లో అనేక ఇళ్లకు భగీరథ నీళ్లు రావడం లేదనే ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపర్చడానికి ఆయా ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. బుగ్గారం మండలంలో మొత్తం 5585 ఆవాసాలుండగా ఇప్పటి వరకు 3989 ఆవాసాలలో సర్వే పూర్తిచేసినట్లు ఎంపీవో అఫ్జల్‌మియా తెలిపారు. బుధవారం సిరికొండలో సర్వేను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనందునా ప్రజలు తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు



మల్యాల: మండలంలోని లంబాడిపల్లి నుంచి తక్కళ్లపల్లి వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా మొక్కలు ఏపుగా పెరిగి, కొమ్మలు రోడ్డుపై విస్తరించి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు చిన్ననీటి కాలువ నీటితో రోడ్డు కోతకు గురై గుంత ఏర్పడింది. చెట్ల కొమ్మలతో కోతకు గురైన రోడ్డు కనిపించక వాహనదారులు గుంతలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి, రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

యువత సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి



విజేతలకు బహుమతి అందిస్తున్న మల్లేశ్

మల్లాపూర్: యువత సామాజిక కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేశ్ అన్నారు. మండలంలోని రేగుంట నిర్వహిస్తున్న ఆర్‌పీఎల్(రేగుంట ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నీ ముగింపు వేడుకలకు బుధవారం హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మొగిలిపేట వీడీసీ చైర్మన్ ఎండీ.మహబూబ్, ఆర్‌పీఎల్ ఫ్రాంచైజీ ఓనర్స్ కుందేళ్ల రాజేష్, డాక్టర్ వినోద్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీఒక్కరికి నట్టల నివారణ మాత్రలు



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

పెగడపల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికి నట్టల నివారణ మాత్రలు వేసి ఎన్‌డీడీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి నరేశ్ కోరారు. పెగడపల్లి పీహెచ్‌సీ బుధవారం నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్లలోపు ఉన్న వారందరికీ మాత్రలు అందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, జయశీల, అనిల్‌కుమార్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ విద్యార్థినికి స్కాలర్‌షిప్



స్కాలర్‌షిప్ కిట్ అందిస్తున్న నిర్వాహకులు, హెచ్ఎం

సారంగాపూర్: బీర్‌పూర్ జిల్లా పరిషత్ లో మొన్నటి పరీక్షల్లో పదో తరగతి పూర్తి చేసిన వేదశ్రీ అనే విద్యార్థిని జఠాధరా ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సూపర్ 20 స్కాలర్‌షిప్ పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. జఠాధరా ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ బృందం సభ్యులు బీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో వేదశ్రీకి స్కాలర్‌షిప్ కిట్‌ను అందజేశారు. వేదశ్రీకి రెండేళ్లపాటు ఐఐటీ జేఈఈ ఆన్‌లైన్ కోచింగ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ్, పాఠశాల హెచ్‌ఎం నర్సింహ్మమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాలలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/కోరుట్ల/మెట్‌పల్లి/ రాయికల్/కథలాపూర్/ధర్మపురి/ మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి: కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్ ఆధ్వర్యంలో జగిత్యాలలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో కేకలు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దేశ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న గొప్ప నాయకుడు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలుపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యం అధిక ఫీజుల వసూళ్లతో పాటు అధిక రేట్లకు స్కూల్ యూనిఫాం, బుక్స్‌లను విక్రయిస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు బుధవారం తహసీల్దార్ కృష్ణ చైతన్యకు వినతిపత్రం సమర్పించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో అందజేసారు. పాఠశాలల్లో ఎటువంటి నోటుబుక్స్, యూనిఫామ్స్, షూ లాంటివి విక్రయించరాదని ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఈ జీవోను మండల పాఠశాలల యాజమాన్యాలకు పంపించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు గాజు భాస్కర్, బెజ్జారపు లవన్‌కుమార్, బండారి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, నరెడ్ల శంకర్ తదితరులున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే అత్యుత్తమ బోధన



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

సారంగాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందుతుందని ఇంటర్‌మీడియట్ జిల్లా నోడల్ అధికారి బి. నారాయణ, సారంగాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కొంక వేణు అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత పాఠ్యపుస్తకాలు వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారంగాపూర్ జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాల సాధనలో జిల్లాలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తుందన్నారు. ఇటీవల వచ్చిన ఫలితాల్లో విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించి సత్తాచాటారని పేర్కొన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని, పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేందర్, రాజు, సౌజన్య, వెంకటేశ్వర్లు, సుజాత, సతీశ్, రాజ్‌కుమార్, రజిత, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాన్ని బలోపేతం చేసుకుందాం



మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం

మల్లాపూర్: మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య నుంచి అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని సొసైటీని బలోపేతం చేసుకుందామని వాల్గొండ మత్స్య సహకార సంఘం నూతన అధ్యక్షుడు పందిరి నాగరాజు అన్నారు. మండలంలోని వాల్గొండలో బుధవారం స్థానిక గంగపుత్ర భవనంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పందిరి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఉట్నూరి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం మహేందర్, కోశాధికారిగా లంబాడిపెల్లి రాజేందర్, కార్యవర్గసభ్యులు పల్లికొండ శేఖర్, ఎల్ల నడ్పిగంగారాం,గుమ్ముల నరేశ్, అల్లిపురం బాజయ్య, లంబాడిపెల్లి రాజంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

డీఎంహెచ్‌వోను కలిసిన టీఎన్జీవో మెడికల్‌ఫోరం నాయకులు



అభినందనలు తెలుపుతున్న నాయకులు

జగిత్యాల: ఇటీవల డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన సమియోద్దీన్‌ను జగిత్యాల జిల్లా మెడికల్ జాక్ చైర్మన్ టీఎన్జీవో మెడికల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎనుగంటి రాజేశం ఆధ్వర్యంలో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంమోహన్, విజయభాస్కర్, దేవన్న, శ్రీనివాస్, హరి, సతీశ్‌కుమార్, సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సారంగాపూర్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమాని, డ్రైవర్లపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్‌చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం ధర్మపురి మండలం ఆరెపల్లి నుంచి బీర్‌పూర్ మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు సారంగాపూర్ అటవీప్రాంతంలో ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ఆరెపల్లికి చెందిన డ్రైవర్ దర్శనాల సిద్ధు, ట్రాక్టర్ యజమాని పిసుక వెంకటేశంలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌శాఖ ఏడీఈపై ఫిర్యాదు

వెల్గటూర్ : ధర్మపురి విద్యుత్‌శాఖ ఏడీఈపై జగిత్యాల జిల్లా ఎస్ఈకి ఫిర్యాదు చేశాడు ఓ కాంట్రాక్టర్. ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన సాన రఘు అనే కాంట్రాక్టర్ తాను చేసిన పనులకు తనకు రావాల్సిన సుమారు రూ. 2.5 లక్షలకు సంబంధించిన బిల్స్ గురించి మాట్లాడడానికి మంగళవారం ధర్మపురి ఏడీఈ ఆఫీస్‌కి వెళ్లగా బిల్స్ పెట్టకపోగా, కమీషన్ల కోసం వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారని, ఇదేంటని అడిగితే తన పట్ల అసభ్యంగా మాట్లాడాడని ఎస్ఈకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు అన్యాయం చేసిన ఏడీఈపై ఎంక్వైరీ చేసి తగు చర్యలు తీసుకోవాలని సాన రఘు ఎస్ఈకి ఫిర్యాదు చేశారు.